మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాములు.. వారంలోగా శంకుస్థాపనకు చర్యలు

రైతులు డిమాండ్ ఉన్న పంటల సాగుపై దృష్టి సారించాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్గొండ, వుదయం ప్రతినిధి

రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మంచి ధర లభించేలా మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అనువైన స్థలం అందుబాటులో ఉంటే వారంలోగా శంకుస్థాపన చేసేలా ప్రణాళిక రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం అనుముల మండలం శ్రీనాథపురం గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటలు, తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు పండించిన ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకొని మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతులందరూ సమిష్టిగా ముందుకు వస్తే మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా చర్యలు చేపడతామని చెప్పారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద గోదాముల నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తామని, మహిళా సంఘాలకు అనువైన భూమి అందుబాటులో ఉంటే వారం రోజుల్లోనే శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కోల్డ్ స్టోరేజీలు, గోదాములు అందుబాటులోకి వస్తే రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకొని మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గోదాముల నిర్మాణం, పంటల సాగు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వ్యవసాయానికి ప్రభుత్వం అవసరమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నప్పటికీ, రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకుంటూ, నీటిని పొదుపుగా వినియోగించి అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు కూడా రానున్న రోజుల్లో తగ్గే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. మార్కెట్లో డిమాండ్, ధరలు ఉన్న పంటలను గుర్తించి సాగు చేపట్టాలని, పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్ పరిస్థితులు ఎలా ఉంటాయో ముందుగానే అంచనా వేయాలని తెలిపారు. 100 రోజుల్లో చేతికి వచ్చే పంటలకు మార్కెట్లో ఎంత మేరకు గిరాకీ ఉందో తెలుసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, శ్రీరామనవమి వరకు పరిస్థితులను గమనించి తదుపరి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. చిక్కుడు, మినుములు, కందులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. రైతుల్లో డిగ్రీలు చదువుకున్న వారు కూడా ఉన్నారని, వారు వ్యవసాయ రంగంలో నూతన ఆలోచనలతో ముందుకు వచ్చి ఆధునిక సాగు విధానాలను అనుసరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మల్రెడ్డి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలి
- రెండు పడక గదుల ఇళ్ల ను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం వుదయం బ్యూరో , నవంబర్ -10

ఖమ్మం జిల్లాలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్లను యథాస్థితిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేతకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం క్షేత్రస్థాయిలో పలు మండలాల్లోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో 30, సింగిరెడ్డిపాలెం గ్రామంలో 48, శంకరగిరి తండా గ్రామంలో 30, కూసుమంచి మండలం మల్లెపల్లి గ్రామంలో 16, ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురంలో 192 అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అదే స్థాయి నుంచి పూర్తి చేసుకునేందుకు అంగీకారంతో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయించవలసిందిగా అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తిగా పారదర్శకమైన విధానాన్ని అవలంబించాలని తెలిపారు. ఇళ్ల సముదాయాల వద్ద విద్యుత్, శానిటరీ, త్రాగునీటి సరఫరా తదితర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్లు రాంప్రసాద్, సైదులు, విజయేందర్ రెడ్డి, జయచంద్ర, హౌజింగ్ డీఈ కె. జగ్రామ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి - దళారి వ్యవస్థను అరికట్టాలి

- తూకం, తాలు పేరుతో రైతులకు 2.5 కేజీల కోతలతో అన్యాయం
- నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి
- కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్



చిలుకూరు నవంబరు 10:(వుదయం)

రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని, దళారులు మరియు వ్యాపారస్తులకు వత్తాసు పలుకుతూ అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేస్తోందని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, తీవ్రస్థాయిలో మండిపడ్డారు, మండల కేంద్రంలో మంగళవారం పర్యటించి, రైతుల పంటను మరియు కొనుగోలు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా, మల్లయ్య యాదవ్, మాట్లాడుతూ, పెట్టుబడి సాయం లేదు.. కరెంటు లేదు, ఎల్నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ, ఆకాశాన్ని నమ్ముకుని రైతులు ఆరుగాలం శ్రమించి వరి సాగు చేశారు. కానీ ప్రభుత్వం నుండి రైతులకు కనీస సహాయం అందలేదు. రైతుబంధు ఇవ్వలేదు, సకాలంలో సాగునీరు అందించలేదు, కరెంటు లేదు, కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని అసమర్థ స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది.

అకాల వర్షాలకు తడిసిన ధాన్యం నెపంతో దళారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. తూకం, తాలు పేరుతో బస్తాకు రెండున్నర కిలోల చొప్పున అదనంగా కోత విధిస్తూ వ్యాపారస్తులు రైతులను మోసం చేస్తున్నారు. నిన్నటి వరకు రూ. 4,200 ఉన్న ధాన్యం ధరను, రోజురోజుకూ తగ్గిస్తూ ఈరోజు రూ. 3,200 లకు పడవేశారు. క్వింటాలుకు ఏకంగా వెయ్యి రూపాయలు తగ్గించి రైతుల పొట్ట కొడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఒకవైపు రైతుకు కనీస మద్దతు ధర దక్కడం లేదు, మరోవైపు మార్కెట్లో బియ్యం ధరలు చుక్కలనంటుతున్నాయి. కిలో బియ్యం ధర రూ. 90 దాటిపోవడంతో సామాన్యులు, కూలీలు బియ్యం కొనుక్కోలేని దయనీయ పరిస్థితి నెలకొంది. సివిల్ సప్లైస్ మంత్రి అండదండలతోనే ఈ బ్లాక్ మార్కెట్ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని, అధికారులు కేవలం కాగితపు ప్రకటనలకే పరిమితమయ్యారని ఆయన విమర్శించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, వరి వేయవద్దని చెప్పిన ప్రభుత్వ మాట విని పొలాలను పడావు పెట్టిన రైతులకు ఇంతవరకు ఎలాంటి కరువు భత్యం అందలేదు. కరువు మండలాలుగా ప్రకటించినా నయా పైసా సాయం చేయలేదు. తుఫానుల వల్ల దెబ్బతిన్న పొలాలకు నష్టపరిహారం అంచనా వేయలేదు, కేంద్ర బృందాలు కూడా వచ్చి పరిశీలించిన దాఖలాలు లేవు. "దున్నపోతు మీద వర్షం పడ్డట్టు" వ్యవహరిస్తూ మొద్దు నిద్రపోతున్న ఈ ప్రభుత్వం వెంటనే మేల్కోవాలని మల్లయ్య యాదవ్, డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని, దళారుల దోపిడీని అరికట్టి రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, మండల పార్టీ అధ్యక్షులు అక్కినపల్లి జానకిరామ చారి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, అలస కాని జనార్దన్,కొండ అన్నపూర్ణ, షేక్ పాషా, అమరగాని లింగరాజు, అంబాల వెంకటి, నూకపంగు వెంకటి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిలుకూరు నవంబర్ 10:(వుదయం)

మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో, ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించిన తహసిల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో మొక్కపాటి నరసింహారావు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం అందించే మద్దతు ధర కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తుందని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో, ఏపిఎం వీరబాబు, ఆర్ ఐ సీతయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం



శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్గొండ జిల్లా
వుదయం ప్రతినిధి నవంబర్ 10

నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పాకాల రాములమ్మ, బోయ సత్తెమ్మ, శ్యాం సుందర్‌రెడ్డి, మర్రి మాధవి లకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వర ప్రదాయినిగా నిలుస్తోందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత
- కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్

మునుగోడు, నవంబర్ 10 (వుదయం):



ప్రజారోగ్య రంగంలో నిరంతరం సేవనం దిస్తున్న ఆశా కార్యకర్తల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వరికుప్పల ముత్యాలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక సహాయకులకు ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆశా కార్యకర్తలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు చెల్లించాలని, రిటైర్మెంట్ సమయంలో రూ.5 లక్షల బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. పారితోషికంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, ప్రతి ఆదివారం, పండుగలతో పాటు సంవత్సరానికి 20 రోజుల క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, రెండో పీఆర్సీలో రూ.30 వేల కనీస వేతనం నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండు డీఏలను ఆశా కార్యకర్తలకు కూడా వర్తింపజేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ ఆశాలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత, ఆశా వర్కర్స్ యూనియన్ మునుగోడు మండల అధ్యక్షురాలు వనం నిర్మల, ఉపాధ్యక్షురాలు కమలమ్మ, కవిత, మమత, కమల, నాంపల్లి మండలం ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కవిత, మమత, రేణుక, సైదమ్మ, సునంద, అంజమ్మ, చిన్నమ్మ, సునీత, ఇందిరా, సైదమ్మ, వివిధ మండలాల నుంచి ఆశా వర్కర్ యూనియన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వెల్మకన్నేలో వెలుగులు.. 36 విద్యుత్ స్తంభాలకు వైర్ల అనుసంధానం

సర్పంచ్ రావుల స్వప్న రమేష్ చొరవ

గట్టుప్పల్, నవంబర్ 10 (వుదయం):

మునుగోడు నియోజకవర్గం గట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నే గ్రామంలో ప్రజల దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలకు చెక్ పడింది. గ్రామస్తులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించాలనే లక్ష్యంతో మంగళవారం గ్రామంలో కీలక అభివృద్ధి కార్యక్రమం చేపట్టారు.స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో, గ్రామ సర్పంచ్ రావుల స్వప్న రమేష్ ప్రత్యేక చొరవ తీసుకుని వెల్మకన్నే గ్రామంలోని వివిధ ప్రాంతాలలో 36 విద్యుత్ స్తంభాలకు వైర్ల అనుసంధాన (కనెక్షన్) పనులను విజయవంతంగా పూర్తి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావుల స్వప్న రమేష్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపడతామని ఆమె తెలిపారు.

ఆత్మకూర్ (ఎస్) మండలంలో ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారీపై సమగ్ర విచారణ జరపాలి

- అర్హతలు పరిశీలించకుండా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు
- అధికారులు స్పందించాలి: తగుళ్ళ జనార్దన్ యాదవ్

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్), నవంబర్ 10: వుదయం ప్రతినిధి



ఆత్మకూర్ (ఎస్) మండల రెవెన్యూ అధికారికి ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారీ విషయంలో నిబంధనలు పాటించడం లేదని, అర్హత లేని వారికి కూడా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించాలని జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తగుళ్ళ జనార్దన్ యాదవ్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆయన అన్నారు. మండలంలో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ నేపథ్యంలో ఎంత మందికి ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్లు జారీ చేశారు, వారి ఆదాయ, ఆస్తుల వివరాలను ఏ విధంగా పరిశీలించారు, అర్హత ప్రమాణాలను పాటించారా అనే అంశాలపై పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని ఆయన కోరారు. ఈ డబ్ల్యూ ఎస్ కోటా అనేది ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి మాత్రమే వర్తించాలి. ఎవరైనా అనర్హులు తప్పుడు వివరాలతో సర్టిఫికెట్లు పొందినట్లు అయితే వాటిని వెంటనే రద్దు చేసి, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆత్మకూర్ (ఎస్) మండల తహసీల్దార్ ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారీపై సమగ్ర విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండాలని, అర్హులకు అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఈ అంశంపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా న్యాయబద్ధమైన విచారణ చేపట్టాలని జన సేవా సమితి డిమాండ్ చేస్తోంది . ఈ కార్యక్రమంలో ఏర్పుల రవి పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు

పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా

సత్తుపల్లి నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



సత్తుపల్లి పట్టణం, సత్తుపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అందజేశారు సత్తుపల్లి పట్టణం 27 మంది లబ్ధిదారులకు రూ.27,03,132 విలువైన చెక్కులు. సత్తుపల్లి మండలం 36 మంది లబ్ధిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ఆవశ్యకతను వివరించారు. మహిళల సంక్షేమం, ఆర్థిక భరోసా కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మహిళలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు మున్సిపల్ చైర్మన్ రిహన్ కమల్ పాషా , కౌన్సిలర్లు, నసీమా బేగం షరీఫ్ మండల కాంగ్రెస్ నాయకులు గుంటూ సూర్య రామారావు మహిళలు పాల్గొన్నారు.

కార్తీకమాస శోభతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న రామన్నపాలెం గ్రామం

శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత కోటేశ్వర స్వామి దేవస్థానంలో వైభవంగా కార్తీకమాస ప్రత్యేక పూజలు



సత్తుపల్లి నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో భక్తి భావాన్ని చాటిచెప్పేలా రామన్నపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత కోటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నవంబర్ 10, 2026 నుంచి డిసెంబర్ 8, 2026 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్తీకమాసం శివారాధనకు అత్యంత పవిత్రమైన మాసం కావడంతో భక్తుల ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే ఉద్దేశంతో ఆలయ పూజారి ఊటుకూరి భార్గవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్తీకమాసం సందర్భంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. సాయంకాలం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నారు. భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేయించుకునే అవకాశం కల్పించారు.

ప్రత్యేక కార్యక్రమాలు:

– నవంబర్ 9న ఆకాశదీపం ప్రారంభం
– నవంబర్ 13న నాగుల చవితి ప్రత్యేక పూజలు
– నవంబర్ 16న తొలి కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు
– నవంబర్ 23న రెండవ కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు
– నవంబర్ 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 7 గంటలకు అత్యంత వైభవంగా జ్వాలాతోరణం కార్యక్రమం
– నవంబర్ 30న మూడవ కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు
– డిసెంబర్ 8న కార్తీక అమావాస్య సందర్భంగా రుద్రహోమం నిర్వహణ

కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే జ్వాలాతోరణం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు. ఈ నెల రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, తమ గోత్ర నామాలతో అభిషేకాలు చేయించుకోవాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ, భక్తి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



జిల్లా స్థాయిలో చింతకాని ఎంఈఓకు అరుదైన గౌరవం

- వేదికపై సలాది రామారావుకు ఘన సన్మానం
- విద్యారంగంలో సేవలకు సముచిత గుర్తింపు
- మండలానికి గర్వకారణంగా నిలిచిన సత్కారం

చింతకాని నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో సమగ్ర శిక్షా ఖమ్మం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆల్ రౌండ్ స్కూల్స్ అచీవ్‌మెంట్ కార్యక్రమంలో చింతకాని మండల విద్యాశాఖాధికారి సలాది రామారావుకు ఘన సన్మానం లభించింది. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి వాసంతి చేతుల మీదుగా ఆయన శాలువాతో సత్కరించబడి జ్ఞాపికను అందుకున్నారు. విద్యారంగంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ పాఠశాలల అభివృద్ధి విద్యార్థుల విద్యా ప్రగతి ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలులో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవం కల్పించారు. జిల్లా స్థాయి వేదికపై చింతకాని మండల ఎంఈఓకు లభించిన ఈ గుర్తింపు మండల విద్యాశాఖకు ప్రత్యేక గౌరవంగా నిలిచింది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు సమష్టి కృషి అవసరమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి వాసంతి చేతుల మీదుగా సన్మానం అందుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయాలి




మునగాల , వుదయం ప్రతినిధి

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న అఖిలభారత రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మునగాల మండల కేంద్రంలో మహాసభల విజయవంతానికి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, రైతుల హక్కుల పరిరక్షణతో పాటు వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు అఖిలభారత రైతు సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే ఈ మహాసభలకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహాసభల విజయవంతానికి బుధవారం మునగాల మండల వ్యాప్తంగా డప్పు వాయిద్యాలు, కోలాట బృందాల నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతుల ఐక్యతను చాటుతూ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి , చందా చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, సుంకర పిచ్చయ్య, షేక్ సైదా, జానయ్య, కృష్ణారెడ్డి, వెంకన్న, వినోద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతర చర్యలు

- ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి
- ఎస్పీ కె. నరసింహ ఆదేశాలతో ఎన్ హెచ్-65 వెంట ప్రత్యేక చర్యలు
- ప్రమాద ప్రాంతాల్లో ఆక్రమణలు, బోర్డులు, పొదల తొలగింపు




సూర్యాపేట, నవంబర్ 10: వుదయం ప్రతినిధి

సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి 65 వెంట రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని జాతీయ రహదారి 65 పై అంజనాపురి చౌరస్తా, కొత్త మార్కెట్ చౌరస్తా, ఈనాడు జంక్షన్ తదితర ప్రమాద ప్రభావిత ప్రాంతాల వద్ద రహదారి భద్రత చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్లను ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను తొలగించడంతో పాటు, వాహనదారులకు ఇబ్బంది కలిగించే వ్యాపార బోర్డులను తొలగిస్తున్నామని తెలిపారు. రహదారుల వెంట పెరిగిన పొదలను తొలగించడం, అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం వాహనదారుల అజాగ్రత్త, నిర్లక్ష్యమేనని, ఒక ప్రమాదంలో వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని పేర్కొన్నారు. జరిమానాలు విధించడం కేవలం శిక్షించడానికి మాత్రమే కాకుండా వాహనదారుల్లో బాధ్యతాయుతమైన మార్పు తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సమ్మె నోటీస్ అందజేత

దమ్మపేట నవంబర్ 10(వుదయం ప్రతినిధి)



ఆశ వర్కర్లు గ్రామీణ పట్టణ ఆరోగ్యవ్యవస్థలో కీలకపాత్ర వహిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు 18 వేల రూపాయలు వేతనం ఇవ్వకుండా ఆశవర్కర్లను మోసగించటం వలనే డిసెంబర్ 15 నుండి సమ్మెకు వెళ్లవలసిన పరిస్థితి వచ్చిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ అన్నారు. మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వసంత్ కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ ఉదయం నుండి రాత్రి వరకు ఫీల్డ్ వర్క్ ఆన్లైన్ సర్వేలు టార్గెట్లు డ్యూటీలు చేస్తున్నప్పటికీ పెరుగుతున్న ధరలకు తగ్గట్లుగా వేతనాలు పెరగటం లేదని అన్నారు. గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యాయని, హామీలు అమలు కోసం ఆందోళనలు నిర్వహిస్తుంటే నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సమ్మెకు వెళ్లడం తప్ప వేరే గత్యంతరం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆశా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆశ వర్కర్లకు 18 వేల రూపాయల వేతనం నిర్ణయించాలని ఉద్యోగ భద్రత చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సునీత, శారద, భాగ్యమ్మ అంజలి, రజిని, నాగమణి జైనాబీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ జట్టుకు ఎంపికైన రావుల గణేష్‌కు గుత్తా అమిత్ రెడ్డి ప్రోత్సాహం



హాకీ బ్యాట్ కొనుగోలుకు రూ.12 వేల ఆర్థిక సహాయం

నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 10:

నల్గొండ పట్టణానికి చెందిన యువ హాకీ క్రీడాకారుడు రావుల గణేష్ జాతీయ హాకీ జట్టుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ జట్టుకు ఎంపికైన ఏకైక క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన గణేష్‌ను ప్రోత్సహిస్తూ గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హాకీ బ్యాట్ కొనుగోలు నిమిత్తం ఈ మొత్తాన్ని అందించి క్రీడాకారుడికి అండగా నిలిచారు. యువ క్రీడాకారులు తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని, వారికి ప్రోత్సాహం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్, నల్గొండ జిల్లా హాకీ కోచ్ ఎవరు అలీ, పీఏ రాంప్రసాద్, మాదగోని కృష్ణ, మాగంటి రాఘవరావు, జక్కల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐఆర్–ఐఐసీటీ శాస్త్రవేత్తలతో గిరిజన విద్యార్థుల ముఖాముఖి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం 10/11/26 వుదయం ప్రతినిధి;

గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలపై సమగ్ర అవగాహన కల్పించి, భవిష్యత్తులో ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జన్‌జాతీయ గౌరవ్ దివస్–2026 వేడుకల్లో భాగంగా మంగళ వారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం గిరిజన విద్యార్థుల్లో నూతన ఆలోచనలకు, పరిశోధనల పట్ల ఆసక్తికి, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలనే తపనకు ఎంతగానో దోహదపడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్ఐఆర్–ఐఐసీటీకి చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సురేందర్ సింగ్ జాదవ్, డాక్టర్ ఆరాధన ప్రియదర్శిని, డాక్టర్ లింగ బానోతు, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ సి. చంద్రశేఖర్, సీనియర్ రీసెర్చ్ స్కాలర్ పి. రవీంద్ర రెడ్డి విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై శాస్త్రీయ పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉన్నత విద్యలో లభించే విస్తృత అవకాశాల గురించి వివరించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులు, పరిశోధనల ద్వారా మానవ జీవన ప్రమాణాల్లో వస్తున్న అభివృద్ధి, దేశ ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిలో శాస్త్రవేత్తల పాత్ర వంటి అంశాలను విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాల్లో విద్యార్థులు తమ అభిరుచి, ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా కెరీర్‌ను ఎలా ఎంచుకోవాలి, ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎలాంటి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి, పరిశోధనా రంగంలో ప్రవేశించడానికి అవసరమైన విద్యార్హతలు, నైపుణ్యాలు, కృషి, పట్టుదల వంటి అంశాలపై శాస్త్రవేత్తలు విలువైన సూచనలు అందించారు. పాఠ్యపుస్తకాల్లో చదివే విషయాలను కేవలం పరీక్షల కోసమే కాకుండా వాటి వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను తెలుసుకోవాలని, ప్రతి విషయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రయోగాల ద్వారా కొత్త విషయాలను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ (జనరల్) డేవిడ్ రాజ్, గురుకులం ఆర్సీఓ అరుణకుమారి, ఐటీడీఏ పరిధిలోని వివిధ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకులాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గిరిజన విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించడం, పరిశోధన రంగంలోని అవకాశాలను పరిచయం చేయడం, పోటీ పరీక్షల ద్వారా వారి విజ్ఞానాన్ని పరీక్షించి ప్రోత్సహించడం వంటి అంశాలతో ఈ కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. భవిష్యత్తులో గిరిజన విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు మార్గదర్శకంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయం

- భవిష్యత్తులో శ్రీ అనేశ్వరమ్మ గుట్ట అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించాలి
- శివగురువు తాడెం అనిల్ కుమార్

నల్గొండ జిల్లా నవంబర్ 10వుదయం ప్రతినిధి



నల్లగొండ పట్టణంలోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.20కోట్ల నిధులు కేటాయించడం పట్ల శివ గురువు తాడెం అనిల్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బుర్రి చైతన్య, శ్రీనివాస్ రెడ్డి, అబ్బగోని రమేష్‌తో పాటు కృషి చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆలయ భక్తులు, గురుస్వాములకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శివాలయాన్ని అభివృద్ధి చేసుకోవడం శివభక్తులందరి బాధ్యతని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ఆలయాలకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి పట్టణ ప్రజలంతా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో శ్రీ అనేశ్వరమ్మ గుట్ట అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని పరమశివుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. శివభక్తులందరూ ఐక్యంగా ఉండి ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

విద్యార్థులకు ఆక్స్ఫర్డ్ నిఘంటువుల పంపిణీ

జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ అభినందనలు

మునగాల, నవంబర్ 10 (వుదయం):




విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, పుస్తక పఠనంపై ఆసక్తిని కల్పించే లక్ష్యంతో మునగాల పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల నిఘంటువులను పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి పి. వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపల్‌కు నిఘంటువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. "చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. గాని ఒక మంచి పుస్తకం కొనుక్కో" అనే సూక్తితో విద్యార్థులను ప్రోత్సహించారు. నిఘంటువులను ఉపయోగించి ఆంగ్ల పదాల ఉచ్చారణ, అర్థాలను తెలుసుకోవాలని, ప్రతిరోజూ కొత్త పదాలను నేర్చుకుంటూ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

అనంతరం గత నెలలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థుల బృందాన్ని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన విద్యార్థిని ఎం. సాహితిని ఎంఈఓ ప్రత్యేకంగా అభినందించారు. చదువుతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె. వీరబాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జె. రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అమెరికాలో అదృశ్యమైన శ్రీజ ఆచూకీ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- బాధిత కుటుంబానికి కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫోన్‌లో భరోసా..
- పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్గొండ జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి



నల్గొండ జిల్లా కనగల్ మండలం అమెరికాలోని బోస్టన్‌లో చదువుకుంటున్న కనగల్ మండలం శాబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన కోయ యాదగిరిరెడ్డి, రూప దంపతుల ఏకైక కుమార్తె శ్రీజ ఈ నెల 2వ తేదీ నుంచి అదృశ్యమైంది. పుట్టినరోజు వేడుకల ఏర్పాట్లలో భాగంగా బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆందోళనకు గురయ్యారు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆమె ఆచూకీ తెలియలేదు. కుమార్తె ఆచూకీ తెలియక తీవ్ర ఆవేదనలో ఉన్న తల్లిదండ్రులను నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం శాబ్దుల్లాపూర్ గ్రామంలో పరామర్శించారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేయడంతో ఆయన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శ్రీజ ఆచూకీ కనుగొనేందుకు సహకరించాలని కోరారు. దీనిపై కేటీఆర్ వెంటనే స్పందించి బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని, శ్రీజ తిరిగి వస్తుందని భరోసా ఇచ్చారు. పూర్తి వివరాలు తనకు అందించాలని, అమెరికాలో తనకు పరిచయమున్న వారితో మాట్లాడి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. వివరాలను వెంటనే పంపించాలని కంచర్ల భూపాల్‌రెడ్డిని కోరారు. అదేవిధంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సైతం ఫోన్‌లో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదగిరిరెడ్డి దంపతుల ఏకైక కుమార్తె కనిపించకపోవడంతో వారు పడుతున్న వేదన తనను కలచివేసిందన్నారు. విషయం తెలియగానే కేటీఆర్ స్పందించి కుటుంబానికి భరోసా ఇవ్వడం, తన పరిచయాల ద్వారా సహకారం అందిస్తానని చెప్పడం వారికి కొంత ఊరటనిచ్చిందని తెలిపారు. ఈ పరామర్శలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీం పాషా, కాంచనపల్లి రవీందర్‌రావు, కనగల్ పార్టీ అధ్యక్షుడు అయితగోని యాదయ్య, రావుల శ్రీనివాసరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, కదారి కృష్ణయ్య, కోట్ల జయపాల్‌రెడ్డి, సిరిగిరి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాడ ఎక్కడ? -అర్హుల జాబితా ఎప్పుడు?

- లబ్ధిదారుల జాబితాను ఎప్పుడు ప్రకటిస్తారు?
- అర్హత ఉన్నప్పటికీ ఇల్లు రాని పేదల పరిస్థితి ఏమిటి ?

చిలుకూరు నవంబర్ 10 :(వుదయం)

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో పేదవాడి సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుంది? ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకుని అశగా ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు సమాధానం చెప్పేదెవరు? ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇళ్లు వస్తాయని అశతో ఎదురుచూస్తున్న పేదలకు మాత్రం రోజులు గడుస్తున్నా స్పష్టత కనిపించడం లేదు. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తూ, చిన్నచిన్న గుడిసెల్లో కుటుంబాలను నెట్టుకొస్తున్న నిరుపేదలు సొంతింటి కోసం ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అధికారుల విచారణలు, వివరాల సేకరణ జరిగినప్పటికీ తమ పేర్లు అర్హుల జాబితాలో ఉన్నాయో లేదో తెలియని పరిస్థితి నెలకొందని దరఖాస్తుదారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలు అర్హుల ఎంపిక పూర్తయిందా?

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హుల ఎంపిక ప్రక్రియ ఏ దశలో ఉంది? ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని దరఖాస్తులను పరిశీలించారు? ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను ఎందుకు బహిరంగంగా ప్రకటించడం లేదు? అన ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన పథకం క్షేత్రస్థాయిలో అర్హులకు చేరుతోందా? దరఖాస్తులు చేసుకున్న పేదలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందా? అధికారులే స్పష్టం చేయాలి.

బాధ్యులెవరు?

నిజమైన నీరు పేదలను పక్కన పెట్టి అనర్హులకు అవకాశం కల్పించారనే ఆరోపణలకు తావులేకుండా ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగాలి. రాజకీయ పలుకుబడి, సిఫార్సులకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేయాలి. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

అధికారులకు సూటి ప్రశ్నలు!

మండలంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు వచ్చాయి? అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందా? లబ్దిదారుల జాబితాను ఎప్పుడు ప్రకటిస్తారు? అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు రాని పేదల పరిస్థితి ఏమిటి? ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రజలకు అధికారికంగా ఎప్పుడు స్పష్టత ఇస్తారు?

పేదల సొంతింటి కలను నిరీక్షణకే పరిమితం చేయకండి

ఇప్పటికైనా చిలుకూరు మండలంలో అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలి



ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్థితి గతులను బహిరగతం చేయాలి, అర్హుల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నిజమైన నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే పేదలకు ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు. జీవితకాలం స్వప్నం. ఆ స్వప్నాన్ని నెరవేర్చే బాధ్యత ప్రభుత్వా యంత్రాంగంపై ఉంది, ప్రజల ప్రశ్న ఒక్కటే మండలంలో ఇందిరమ్మ ఇళ్ల జాడ ఎక్కడ? అర్హుల జాబితా ఎప్పుడు?

ఇందిరమ్మ ఇంటి కోసం పేదవాడి ఎదురుచూపు

చింతకాని, నవంబర్ 10: (వుదయం ప్రతినిధి):



తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటుంటే, చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన ఒక పేద కుటుంబంలో మాత్రం దీపావళి అంటేనే భయం వెంటాడుతోంది. పాతర్లపాడు గ్రామానికి చెందిన అల్లిక మునయ్య కుటుంబం పూరిగుడిసెలో నివాసం ఉంటోంది. దీపావళి సందర్భంగా ఎక్కడ టపాసులు వచ్చి తమ ఇంటి మీద పడి పూరి గుడిసె కాలిపోతుందో అనే భయంతో, ఆ కుటుంబ పెద్ద తీవ్రమైన చలిలో సైతం రాత్రంతా నిద్రపోకుండా ఇంటికి కాపలా కాయవలసిన దుస్థితి నెలకొంది. ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలకు ఇంటికి 5 లక్షల రూపాయలు ఇస్తున్నారని తెలియడంతో తమ ఇల్లు కూడా బాగుపడుతుందని ఆ కుటుంబం ఎన్నో ఆశలతో ఎదురుచూసింది. ఫస్ట్ ఫేజ్‌లో తమకు ఇల్లు వస్తుందని భావించారు. కానీ చివరకు వారికి దుఃఖం తప్ప ఏమీ మిగలలేదని బాధితుడు వాపోయాడు. సెంటు భూమి కూడా లేని తమకు ఫస్ట్ ఫేజ్‌లో స్థానం రాలేదని, అదే జాబితాలో పొలం ఉన్నవారికి, ఇల్లు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని బాధితుడు తెలిపాడు. వారికి ఇళ్లు మంజూరు చేసినందుకు తమకు ఎటువంటి బాధ లేదని, కానీ సెంటు భూమి కూడా లేని తాను ఏ విధంగా ఇందిరమ్మ ఇంటికి అనర్హుడిని అవుతానని ప్రశ్నిస్తున్నాడు. ఈ విషయంలో అధికారులు స్పందించి, అర్హులైన పేద కుటుంబానికి చెందిన అల్లిక మునయ్యకి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులకు పంట నష్టపరిహారం తక్షణమే చెల్లించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూరు, నవంబర్ 10 (వుదయం):



ఎలనినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, సాగునీరు అందక పంటలు పూర్తిగా పండక రైతులు అల్లాడిపోతున్నారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చండూరు పట్టణ కేంద్రంలో నిర్వహించిన భారీ రైతు ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్కార్ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఎలనినో తీవ్ర ప్రభావంతో సకాలంలో వర్షాలు పడక, ఉన్న నీరు సరిపోక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని తెలిపారు. పెట్టుబడి పెట్టి, రాత్రింబవళ్ళు కష్టపడినా కనీసం పెట్టుబడి కూడా చేతికి రాక అన్నదాతలు తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారని, దిక్కుతోచని స్థితిలో ఉన్న వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరి సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతన్నలకు ఎకరాకు రూ. 30,000 చొప్పున, పత్తి రైతులకు ఎకరాకు రూ. 50,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని గట్టిగా డిమాండ్ చేశారు.


ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిప్పులు..

ప్రకృతి వైపరీత్యాలతో, అప్పుల ఒత్తిళ్లతో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదంటూ ఎమ్మెల్సీ సత్యం మండిపడ్డారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా ప్రభుత్వం స్పందించి, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులందరినీ ఏకం చేసి పెద్దఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

స్నేహమే మరణానికి శాపంగా మారిందా

- అక్రమ సంబంధం బయట పెడతాడనే భయంతో హత మార్చిన వైనం
- కూల్ డ్రింక్ లో పురుగులు ముందు ఇచ్చి చంపేసిన నిందితులు


కల్లూరు నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):



అక్రమ సంబంధం ఎక్కడ బయటపెడతాడోనని తోటి స్నేహితుడినే నిందితురాలతో కలిసి హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండల పరిధిలోని చిన్న కోరుకొండి గ్రామంలో చోటుచేసుకుంది. చంపినవాడు చనిపోయిన బాలుడు మైనర్లు కావడంతో మరింత కలకలం రేపుతుంది.చిన్న వయసులోనే మనిషిని చంపాలనే క్రూరమైన ఆలోచనలు, అక్రమ సంబంధాలకి అలవాటు పడడంతో సమాజానికి ఏం సంకేతం ఇస్తున్నామో అర్థం కానీ నీచమైన దుస్థితి కలవరపెడుతుంది. కొడుకు మరణంతో (మూగ)గా రోదిస్తున్న తండ్రి. సాంప్రదాయాలను తుంగలో తొక్కి మైనర్ బాలుడుతో అక్రమ సంబంధం పెట్టుకున్న వివాహిత బాలుడు మరణానికి కారణమని జిల్లెల్ల రవికుమార్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిందితుడు చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన నామ అజయ్ తండ్రి రాజ అదే గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. బోనకల్లు మండలం గోవిందపురం గ్రామానికి చెందిన వివాహిత ఇరుగు అపర్ణ వాళ్ల పెద్దమ్మ ఇంటికి చిన్నకోరుకొండి రావడం ఈ క్రమంలో మైనర్ బాలుడితో అక్రమ సంబంధం ఏర్పరచుకుందని తెలిపారు. వాళ్ళిద్దరి అక్రమ సంబంధం చూసిన మృతుడు జిల్లెల రవికుమార్ ను బ్రతకనిస్తే తమ సంబంధాన్ని గురించి గ్రామంలో చెప్తాడనే ఆలోచనతో తనని హతమార్చాలని పక్కా ప్రణాళికతో కూల్ డ్రింక్ లో పురుగుల మందు కలిపి నమ్మకంగా తన స్నేహితుని ద్వారా తాగించారని తెలియజేశారు. ఖమ్మం హాస్పిటల్ లో దాదాపు పది రోజులపాటు మృత్యువుతో పోరాడి మరణించాడు. కుటుంబ కలహాలతో ఇక్కడికి వచ్చి అక్రమ సంబంధంతో ఇద్దరు మైనర్ బాలురుల జీవితాన్ని నాశనం చేసిందని వాపోయారు. ఒకరికి జీవితమే లేకుండా పోయింది మరొకరిని జైలు పాలు చేసిందని అంటున్నారు. ఇటువంటి దుర్ఘటనతో మండలంలో పిల్లల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. తమ పిల్లలు ఎటువంటి స్నేహితులతో తిరుగుతున్నారో వారి ప్రవర్తన ఎట్లుందోనని ఆందోళన చెందుతున్నారు.

జర్నలిస్ట్ అన్వేష్ రెడ్డిని పరామర్శించిన భద్రాచలం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు

భద్రాచలం 10/11/26 వుదయం ప్రతినిధి:



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ)కు చెందిన భద్రాచలం ఆర్–టీవీ రిపోర్టర్ అన్వేష్ రెడ్డికి గత నెలలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగిన నేపథ్యంలో మంగళవారం భద్రాచలంలోని ఆయన నివాసానికి యూనియన్ నాయకులు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారా, ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు బీవీ రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు విజ్జిగిరి రాజా కిరణ్, సీనియర్ నాయకులు బి. దిలీప్, పీవీ బాబు పాల్గొన్నారు. అన్వేష్ రెడ్డి త్వరితగతిన కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి జర్నలిజం రంగంలో తన సేవలను కొనసాగించాలని భద్రాచలం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు ఆకాంక్షించారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

నల్గొండ జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఎన్ హెచ్ ఉద్యోగులు చేపట్టిన దీక్షలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 29వ రోజులకు చేరువవుతున్నా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో ఉద్యోగులు వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి చిత్రపటాలకు ప్రణామాలు అర్పిస్తూ తమ ఆవేదనను తెలియజేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు , డాక్టర్ రాంబాబు, మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక,MLHP ప్రతిభ, డాక్టర్ వెంకటేశం, డెంటల్ టెక్నీషియన్ శ్రీనివాస్,డాక్టర్ గణేష్, ఎండీ ఖలీమ్ , డాక్టర్ టి.రవి, ఎంఎల్‌హెచ్‌పీలు, నర్సింగ్ అధికారులు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, ఇతర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.



కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నల్గొండ జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ నల్లగొండ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ టి. జోష్ణ తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు ఈ నెల 22-11-2026న బయలుదేరి, తిరిగి 25-11-2026న నల్లగొండకు చేరుకుంటాయని పేర్కొన్నారు. భక్తులు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పుణ్యక్షేత్రాల సందర్శనకు ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టీజీఎస్ ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.



సీఐ ప్రతాప లింగంను మర్యాద పూర్వకంగా కలిసిన అశోక్ కుమార్

మునగాల, నవంబర్ 10 (వుదయం):

మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప లింగంను మునగాల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోటు అశోక్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోటు అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సీఐని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కే. కోటేశ్వరరావు, సూర్యాపేట జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి కాలె సామేలు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కెళ్ల పాటి సాయి, సామాజిక మాధ్యమాల సమన్వయకర్తలు పాషా, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు పశువైద్య శాఖలో అంతులేని నిర్లక్ష్య ఆరోపణలు!

- ఆసుపత్రిలో వైద్య అధికారిని కరువు.. రైతులకు సమాధానాలు మాత్రం ఘాటు!
- ప్రశ్నిస్తే బాధ్యతాయుత సమాధానం లేదు.. పైగా నిర్లక్ష్యపు ధోరణి!
- మూగజీవాల ప్రాణాలతో చెలగాటమా..?
  ఉన్నతాధికారుల పర్యవేక్షణ గాలికొదిలేశారా..?

కల్లూరు, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



మూగజీవాలకు వైద్యం అందించాల్సిన పశువైద్యశాఖలోనే విధుల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు అండగా నిలవాల్సిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా? లేవా? అన్న అనుమానాలు కల్లూరు మండలంలో వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రికి వెళ్తే వైద్య అధికారిని కనిపించరనే ఆరోపణలు.. అత్యవసర సమయంలో వైద్యం కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు.. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారాయి.

కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ పశువైద్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ, కల్లూరు పట్టణ పశువైద్య కేంద్రం ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్న వైద్య అధికారిని పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విధుల సమయంలో వైద్య అధికారిని అందుబాటులో ఉండటం లేదని, పశువైద్య కేంద్రానికి వెళ్లిన రైతులకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆసుపత్రి ఎక్కడ..? డాక్టర్ ఎక్కడ..?

ప్రభుత్వం ప్రజల కోసం పశువైద్య కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. వాటిలో వైద్యులు అందుబాటులో ఉండాల్సిన బాధ్యత లేదా? విధుల సమయంలో వైద్యాధికారి అందుబాటులో లేకపోతే రైతులు ఎవరిని ఆశ్రయించాలి? పశువులకు అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎవరు బాధ్యత వహించాలి? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నిస్తే, రైతుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందిస్తున్నామని సమాధానం చెబుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఆ సేవలు ఎప్పుడు, ఎక్కడ, ఎంతమందికి అందుతున్నాయో ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేరా..? ఇదేనా అధికారుల బాధ్యత..?

విధుల నిర్వహణపై వివరణ కోరిన పాత్రికేయుల పట్ల వైద్యాధికారి స్పందించిన తీరు కూడా విమర్శలకు తావిస్తోంది. 'వార్తలు రాసుకోండి.. ఎవరికైనా చెప్పుకోండి.. మీరేం రాసుకుంటారో రాసుకోండి' అంటూ అసహనంగా స్పందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదా? విధులపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూగజీవాల ప్రాణాలు చవకైపోయాయా..?

పశువులే జీవనాధారంగా బతుకుతున్న చిన్న, సన్నకారు రైతులకు పశువైద్య సేవలు అత్యంత కీలకం. పశువు అనారోగ్యానికి గురైతే రైతు కుటుంబం ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి ఉంటుంది. అలాంటి సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోతే రైతుల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ వైద్య సేవలు అందక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తే ఆ ఖర్చు ఎవరు భరించాలి? మూగజీవాలు తమ బాధను చెప్పుకోలేవు కాబట్టి వాటి సమస్యలను అధికారులు కూడా పట్టించుకోరా? అన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది.

గత విమర్శలకూ స్పందన లేదా..? మార్పు ఎప్పుడు..?

గతంలోనూ వైద్యాధికారిణి పనితీరుపై విమర్శలు వ్యక్తమైనప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకే అధికారికి రెండు కేంద్రాల బాధ్యతలు ఉన్న నేపథ్యంలో రెండు చోట్లా వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా? విధుల సమయాలను ఎలా నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమైంది..?

మండల స్థాయిలో పశువైద్య సేవల నిర్వహణపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైద్యాధికారిని హాజరు రికార్డులు, ఆసుపత్రి పని వేళలు, క్షేత్రస్థాయిలో అందించిన వైద్య సేవలు, రైతుల ఫిర్యాదులపై ఇప్పటివరకు ఎలాంటి పరిశీలన జరిగింది? అన్నది వెల్లడించాల్సిన అవసరం ఉంది. కాగితాలపై విధులు నిర్వహించినట్లు చూపిస్తే సరిపోతుందా? క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందుతున్నాయా లేదా అన్నది చూడాల్సిన బాధ్యత అధికారులకు లేదా?

జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలి!


చెన్నూరు, కల్లూరు పశువైద్య కేంద్రాల్లో వైద్యాధికారిని విధుల నిర్వహణపై జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి హాజరు వివరాలు, వైద్య సేవల రికార్డులు, రైతుల ఫిర్యాదులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు తప్పని తేలితే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే ఇలాంటి ఆరోపణలు వినిపిస్తుంటే ఇక సామాన్య రైతు ఎవరిని ఆశ్రయించాలి? మూగజీవాల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు మౌనంగా ఉంటే ప్రజల అనుమానాలకు తెరపడేదెలా?

ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్లు తెరిచి క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తారా..? లేక రైతుల ఆవేదనను గాలికి వదిలేస్తారా..? వేచి చూడాలి!

గురుకులంలో బాలికలకు రక్షణ కరువైందా

- పారిశుద్ధ్య కార్మికుడిపై విద్యార్థినుల తీవ్ర ఆరోపణలు
- బాత్రూమ్‌లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఫిర్యాదు



నల్గొండ జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి

నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాలలో పని చేస్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికుడు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, బాత్రూమ్‌లోకి తీసుకెళ్లి తలుపులు వేసి అసభ్యకరంగా తాకుతున్నాడని కొందరు బాలికలు ఆరోపించినట్లు సమాచారం. ఈ వ్యవహారం గురుకులంలో కలకలం రేపుతోంది. అభం శుభం తెలియని మైనర్ బాలికల పట్ల ఇలాంటి ప్రవర్తనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. విద్యార్థినుల భద్రతను పర్యవేక్షించాల్సిన గురుకుల యాజమాన్యం ఈ విషయంలో తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. చిన్నారులు చేసినట్లు చెబుతున్న ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కలెక్టర్ తక్షణమే స్పందించాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఈ ఘటనపై తక్షణమే స్పందించి ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

మహిళా అధికారులు, బాలల సంక్షేమ శాఖ ప్రతినిధుల సమక్షంలో విద్యార్థినుల నుంచి ఎలాంటి ఒత్తిడి లేకుండా రహస్యంగా వాంగ్మూలాలు సేకరించాలని సూచిస్తున్నారు.

యాజమాన్యం బాధ్యత తేల్చాలి

గురుకులాల్లో చదువుకుంటున్న బాలికలకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. విద్యార్థినుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేసి ఉంటే సంబంధిత అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలి. బాధిత చిన్నారులకు మానసిక భరోసా కల్పించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మైనర్ బాలికల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వ్యక్తిగత, బ్యాంకు వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దు
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 10:

నల్గొండ పట్టణ కేంద్రంలో ఎస్పీ ఆఫీసులో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి. రమేష్, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ టి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం భద్రంగా ఉంచుకోవాలి

'ప్రొటెక్ట్ యువర్ ఐడెంటిటీ' (మీ వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోండి) అనే నినాదంతో రూపొందించిన పోస్టర్ల ద్వారా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారులమని, కస్టమర్ కేర్ సిబ్బందిమని, ప్రభుత్వ అధికారులమని ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతాల రహస్య వివరాలు వెల్లడించవద్దని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమాచారం వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా 'ఆగండి.. ఆలోచించండి.. ధ్రువీకరించుకోండి' అనే సూత్రాన్ని పాటించాలని తెలిపారు.

మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి

సైబర్ మోసానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సైబర్ ఫ్రాడ్ రిజిస్ట్రీ వాట్సాప్ నంబర్ 8712672222 ద్వారా సంబంధిత సమాచారాన్ని తెలియజేయవచ్చని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డీ4సీ ద్వారా జిల్లావ్యాప్తంగా నిరంతరం సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సురక్షితమైన డిజిటల్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని, తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు తొలి రక్షణ అని ఎస్పీ పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, యూనిఫార్మ్స్ పంపిణీలో జాప్యం వద్దు

ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం 10 నవంబర్ 26 వుదయం ప్రతినిధి:

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సదుపాయాలు పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక బాధ్యతతో పనిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ స్పష్టం చేశారు. విద్యార్థులకు అందాల్సిన పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతోపాటు, ప్రతి విద్యార్థికి నాలుగు జతల యూనిఫారాలు అందించాలని, పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల బిల్లులను పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల పనితీరు, విద్యార్థుల విద్యా ప్రగతిపై ఏటీడీవోలు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే హెచ్‌ఎంలు, వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఏటీడీవోలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల వార్డెన్లతో ఐటీడీఏ పీవో బి. రాహుల్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, స్కాలర్‌షిప్‌ల నమోదు, యూనిఫారాల పంపిణీ, కాస్మోటిక్ చార్జీలు, డైట్ చార్జీలు, పాఠశాలల నిర్వహణ బిల్లులు, పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సూచనల మేరకు ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశం ముగింపులో పీవో బి. రాహుల్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన మరోసారి హెచ్‌ఎంలు, వార్డెన్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటిలోగా స్కాలర్‌షిప్‌ల నమోదు, బ్యాంకు ఖాతాల ప్రారంభం, యూనిఫారాల పంపిణీ, పాఠశాలల బిల్లుల క్లియరెన్స్, కాస్మోటిక్ చార్జీలు, డైట్ చార్జీలు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వంటి అన్ని అంశాలను 100 శాతం పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మ, భారతీదేవి, ఇన్‌చార్జి ఏవో రామకృష్ణారెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల వార్డెన్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రామాలయానికి రూ.1.14 లక్షల విలువైన రబ్బరు కార్పెట్ల వితరణ

దాతల సేవలను అభినందించిన ఈవో కే. దామోదర్ రావు



భద్రాచలం 10/11/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో హైదరాబాద్‌కు చెందిన దాతలు తమ ఉదారతను చాటుకున్నారు. దేవస్థానానికి రూ.1.14 లక్షల విలువైన రబ్బరు కార్పెట్లను మంగళవారం వితరణగా అందజేశారు. హైదరాబాద్‌లోని ఓయాసిస్ ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, హరిత దంపతులు తమ కుమారుడు విశ్రుత్, కుమార్తె యశితతో పాటు తమ స్నేహితుల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి విచ్చేసే భక్తులకు ఉపయోగపడే విధంగా, ముఖ్యంగా ప్రతిరోజూ నిర్వహించే నిత్యకల్యాణ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా నిత్యకల్యాణ మండపం ప్రాంగణం మొత్తం వినియోగించుకునేందుకు వీలుగా ఈ రబ్బరు కార్పెట్లను అందజేయడం విశేషం. కార్యక్రమంలో దేవస్థానం ఈవో కే. దామోదర్ రావు, ఏఈవో శ్రావణ్ కుమార్, అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హాలియా నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను త్వరితగతిన ప్రారంభించాలి

కలెక్టర్ ఆదేశం

నల్గొండ: నవంబర్ 10 (వుదయం)



హాలియాలో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మిగిలిపోయిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిని త్వరగా ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంగళవారం అనుముల మండలం హాలియాలో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితారాణిని ప్రారంభానికి సంబంధించిన పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్‌ను త్వరగా సమకూర్చుకొని ఆసుపత్రిని ప్రారంభించాలని సూచించారు. అవసరమైన పరికరాలు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఓపీ సేవలను ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆసుపత్రిలోని ఓపీ విభాగం, గైనిక్ రూమ్, పీడియాట్రిక్ వార్డు, లేబర్ రూమ్, జనరల్ వార్డు, ఫార్మసీ, డిస్పెన్సరీ, ల్యాబ్, ఓపీ బ్లాక్, ఎముకల శస్త్రచికిత్స విభాగం, ఆపరేషన్ థియేటర్లను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి విభాగంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఆసుపత్రి పరిసరాలు, వార్డులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపయోగించిన నీడిల్స్, సిరంజిలు, కాటన్ తదితర వైద్య వ్యర్థాలు ఎక్కడా కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వార్డును ప్రతిరోజూ శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. అన్ని వార్డులకు స్పష్టంగా కనిపించేలా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమర్జెన్సీ వార్డును పరిశీలించిన కలెక్టర్, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన పరికరాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో భర్తతో కలిసి కూర్చున్న గర్భిణీ మహిళను కలెక్టర్ పలకరించి, ఆమె ఎక్కడి నుంచి వచ్చారని, ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, వైద్యులు సక్రమంగా వైద్యం అందిస్తున్నారా, అవసరమైన మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు ఎంతో శ్రద్ధగా వైద్యం అందిస్తున్నారని, తమను బాగా చూసుకుంటున్నారని ఆ మహిళ కలెక్టర్‌కు తెలిపింది. ఈ పర్యటనలో డీసీహెచ్ భాను ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితారాణి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ స్వాతి, డాక్టర్ నవీన్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలను జయప్రదం చేయాలి

బుర్రి శ్రీరాములు పిలుపు

మునగాల, నవంబర్ 10 (వుదయం):

రైతాంగ సమస్యల పరిష్కారం, రైతుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న అఖిలభారత రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మునగాల మండల కేంద్రంలో మహాసభల విజయవంతానికి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వ్యవసాయ రంగ సంక్షోభానికి పరిష్కార మార్గాలను అన్వేషించడంతో పాటు రైతుల హక్కుల పరిరక్షణకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు అఖిల భారత రైతు సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే ఈ మహాసభలకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి, చందా చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, సుంకర పిచ్చయ్య, షేక్ సైదా, జానయ్య, కృష్ణారెడ్డి, వెంకన్న, వినోద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ కుమార్ దీపక్



లక్షెట్టిపేట, నవంబర్ 10 (వుదయం న్యూస్):

ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో లక్షెట్టిపేటలో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలని సూచించారు.ఈ కేంద్రంలో 26 కిలోల బియ్యం బ్యాగుల ధరలను నిర్ణయించారు. బి.పి.టి. పచ్చి బియ్యం రూ.1,352, హెచ్.ఎం.టి. స్టీమ్ బియ్యం రూ.1,898, జె.ఎస్.ఆర్. స్టీమ్ బియ్యం రూ.1,924, పాత బియ్యం రూ.2,028గా నిర్ణయించారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, భోజనశాల పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని, విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నల్లమాస కృష్ణ

నల్గొండ జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి



నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నల్లమాస కృష్ణ నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యావేత్తగా, సామాజికవేత్తగా, రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి వేదికగా వినిపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర

మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థి సంఘ నాయకుడిగా నల్లమాస కృష్ణ ఎన్నో ఉద్యమాలు, పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో అనేక కేసులను ఎదుర్కొంటూ, వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కనపెట్టి రాష్ట్ర సాధనే లక్ష్యంగా పనిచేశారు. తెలంగాణ కోసం తన జీవితంలో కీలకమైన సమయాన్ని, శ్రమను త్యాగం చేసిన ఉద్యమ నేపథ్యం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

ఉద్యమ అనుభవం.. సామాజిక అవగాహన.. పట్టభద్రుల ఆశలు!

నల్లమాస కృష్ణకు ఉన్న విద్యా, సామాజిక, రాజకీయ అనుభవం పట్టభద్రుల సమస్యలపై పోరాటానికి ఉపయోగపడుతుందని ఆయన మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యమాల నుంచి వచ్చిన నాయకుడిగా ప్రజల సమస్యలపై అవగాహన కలిగి ఉండటం ఆయనకు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే ప్రతి ఒక్కరూ అభ్యర్థుల రాజకీయ నేపథ్యంతో పాటు వారి విద్యా అవగాహన, ఉద్యమ అనుభవం, పట్టభద్రుల సమస్యలపై వారి నిబద్ధతను పరిశీలించాల్సిన అవసరం ఉంది. నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ, పట్టభద్రుల హక్కుల కోసం నిరంతరం పనిచేసే ప్రతినిధిని ఎన్నుకోవడం కాలం కోరుతున్న అవసరం. పట్టభద్రుల గొంతుక శాసనమండలిలో బలంగా వినిపించాలంటే.. విద్యావంతుల సమస్యలు తెలిసిన వ్యక్తులకు అవకాశం కల్పించాలనే చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

పోలీస్ క్వార్టర్స్‌లో మహిళా హోంగార్డు దారుణ హత్య

భార్యను బండకేసి కొట్టి చంపిన భర్త.. నిందితుడు అదుపులో

నల్గొండ జిల్లా నవంబర్ 10 వుదయం ప్రతినిధి



నల్లగొండ పట్టణ కేంద్రంలో కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పోలీస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న మహిళా హోంగార్డు మహబూబ్ బీ (43) భర్త చేతిలో హత్యకు గురైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త సతీష్ ఆమెను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్ బీ నల్లగొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తోంది. గతంలో హోంగార్డుగా పనిచేసిన సతీష్‌తో ఆమెకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొన్నేళ్ల క్రితం సతీష్ విధుల నుంచి తొలగించబడటంతో కుటుంబ బాధ్యతలను మహబూబ్ బీ నిర్వహిస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మంగళవారం పిల్లలు పాఠశాలకు వెళ్లిన అనంతరం భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో వాగ్వాదం తీవ్రం కావడంతో ఆగ్రహానికి గురైన సతీష్ భార్య మహబూబ్ బీ తలను బండకేసి కొట్టడంతో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న డీఎస్పీ శివరామిరెడ్డి, సీఐ ఆదిరెడ్డి, రూరల్ ఎస్సై శివప్రసాద్, వన్‌టౌన్ ఎస్సై నాంపల్లి వెంకట్ నారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు డీఎస్పీ శివరామిరెడ్డి తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ నవంబర్ 10(వుదయం)

రైతులకు కనీస మద్దతు ధర కల్పించి, దళారుల దోపిడీని అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. తూకం, తాలు పేరుతో బస్తాకు 2.5 కిలోల కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. క్వింటాల్ ధాన్యం ధర రూ.4,200 నుంచి రూ.3,200కు పడిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కరువు మండలాల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం, కరువు భత్యం అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కొమురం భీం 86వ వర్ధంతి వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం

తిర్యాణి, నవంబర్ 10:



కొమురం భీం జిల్లా తిర్యాణి మండలం మంగి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ నెల 15-11-2026 (ఆదివారం) నిర్వహించనున్న ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం 86వ వర్ధంతి వేడుకలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కే. హరితను గ్రామస్తులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీం ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం గిరిజన గ్రామాల్లో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద్, గ్రామ పటేళ్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ల సమస్యను పరిష్కరించాలి వినతి

రెబ్బెన నవంబర్ 10 (వుదయం) :



బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఏరియా జనరల్ మేనేజర్ రమేష్, ఖైరగూడ ఓపెన్ కాస్ట్ ఇన్‌చార్జ్ మేనేజర్ గౌతమ్ రాజేశ్వర్ రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్. తిరుపతి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా 'ఏ' గ్రేడ్ ఆపరేటర్లకు ప్రమోషన్లు నోచుకోక తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రీజియన్ వ్యాప్తంగా 50 మందికి పైగా అర్హులైన ఆపరేటర్లు ఉన్నప్పటికీ, యాజమాన్యం ప్రతి సంవత్సరం నామమాత్రంగా గతేడాది కేవలం 8 మందిని, ఈ సంవత్సరం కేవలం 10 మందిని మాత్రమే టెస్ట్‌కు ఆహ్వానించడం శోచనీయమన్నారు. యాజమాన్యం అవలంబిస్తున్న ఈ వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ, అర్హులైన ఆపరేటర్లందరికీ వెంటనే 'ఏ' గ్రేడ్ ప్రమోషన్లు కల్పించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యులు జూపాక రాజేష్, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, షిఫ్ట్ ఇన్‌చార్జ్ తుంగల వెంకటేష్ పుట్ట అంజయ్య, యూనియన్ నాయకులతో పాటు పలువురు ఈపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

జిల్లా కలెక్టర్ కె. హరిత



రెబ్బెన, నవంబర్ 10 (వుదయం): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రెబ్బెన మండలంలో పర్యటించిన ఆమె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రికార్డులు, నగదు పుస్తకాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని, గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిపాలనలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీజా ఆచూకీ కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రయత్నాలు

బోస్టన్ పోలీసులతో సమన్వయం చేయాలని తానా ప్రతినిధులకు సూచన

నల్గొండ జిల్లా వుదయం నవంబరు 10:



అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న నల్లగొండకు చెందిన కోయ శ్రీజా రెడ్డి అదృశ్యంపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఆమె ఆచూకీ త్వరగా కనుగొనేందుకు అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఇప్పటికే ఈ-మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. తాజాగా బోస్టన్‌లోని తానా ప్రతినిధి కృష్ణప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను వేగవంతం చేయాలని కోరారు. మంత్రి విజ్ఞప్తి మేరకు తానా ప్రతినిధులు బోస్టన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి కేసు దర్యాప్తు పురోగతిపై అధికారులతో మాట్లాడారు. స్థానిక పోలీసుల సహకారంతో శ్రీజ ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు కృష్ణప్రసాద్ మంత్రికి వివరించారు. శ్రీజ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఆమె ఆచూకీ లభించి క్షేమంగా తిరిగి వచ్చే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బోస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్‌ను మంత్రి కోరారు. మంత్రి కార్యాలయం నుంచి ప్రతి గంటకోసారి సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ తాజా సమాచారాన్ని సేకరిస్తున్నారు. శ్రీజ క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు, తానా ప్రతినిధులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన ఓటర్లు ఈ నెల 21వ తేదీలోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి

కామారెడ్డి, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):-



ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారికి తుది జాబితాలో పేరు చేర్చుకునేందుకు మరో అవకాశం కల్పించింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో అదనపు జిల్లా వి. విక్టర్ మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాలు జారీ చేసినప్పటికీ గైర్హాజరు కావడం, నివాసం మారడం తదితర కారణాలతో ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను చేర్చుకునేందుకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన ఓటర్లు తమ పేర్లను తుది ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవడానికి సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్‌ఓలు), ఎన్నికల నమోదు అధికారులను (ఈఆర్‌ఓలు) సంప్రదించి నిర్దేశించిన విధానంలో ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ నెల 21.11.2026 లోపు దరఖాస్తులను సమర్పించి ఓటరు జాబితాలో తమ పేర్ల నమోదును నిర్ధారించుకోవాలని అదనపు జిల్లా ఎన్నికల అధికారి కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త వీధి లైట్ల వైరింగ్ పనులు ప్రారంభం

అనంతగిరి నవంబర్ 10 వుదయం

మండల పరిధిలోని మొగలాయి కోట గ్రామంలోని 9వ వార్డు ఎస్సీ, బీసీ కాలనీలో గత మూడు రోజులుగా షార్ట్ సర్క్యూట్ కారణంగా వీధి లైట్లు వెలగకాపోవడం తో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగానే అధికారులు వెంటనే స్పందించి మంగళ వారం 9వ వార్డులో వీధి లైట్లకు సంబంధించి కొత్తగా వైరింగ్ పనులు చేపట్టారు. కాలనీవాసుల సమస్యను గుర్తించి, త్వరితగతిన స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ములకలపల్లి భవాని శ్రీకాంత్, పొర్లె కోటేశ్వరరావు,విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నవారు.

చేయూత పింఛన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ క్షుణ్ణంగా జరపాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 10 నవంబర్ 2026



చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ క్షుణ్ణంగా జరగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పింఛను దరఖాస్తుల వివరాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. అర్హులందరికీ పింఛన్ వచ్చేలా చూడాలని అన్నారు. అదే సమయంలో అనర్హులకు పింఛన్లు మంజూరు కాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిశీలన జరపాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయికి వెళ్ళి పారదర్శకంగా సరిచూడాలని సూచించారు. ముఖ్యంగా దివ్యాంగులు, యోవృద్ధులు, వితంతువులు, ఇతర కేటగిరీల వారీగా వచ్చిన వివరాలను, ఆధార్, రేషన్ కార్డు తదితర ధ్రువీకరణ పత్రాలను నిశితంగా తనిఖీ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దరఖాస్తుల పరిశీలనలో ఎటువంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి , డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేల ప్రోత్సాహకం

ఎస్‌బీఎం డైరెక్టర్ సురేష్‌బాబు

మునగాల, నవంబర్ 10 (వుదయం):



గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించి, బహిరంగ మలవిసర్జనను పూర్తిస్థాయిలో నివారించేందుకు ప్రతి కుటుంబం తమ ఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ సురేష్‌బాబు సూచించారు. మునగాల మండలం బరకత్‌గూడెం గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ నగదు నాలుగు రోజుల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగిస్తూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చల్ల గురవయ్య, ఎంపీడీవో, డీపీఓ యాదగిరి నరేష్, గ్రామ కార్యదర్శి పవన్, తొమ్మిదో వార్డు సభ్యుడు కుమ్మరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నష్టాలతో వ్యక్తి ఆత్మహత్య

లక్షెట్టిపేట, నవంబర్ 10 (వుదయం న్యూస్): పట్టణంలోని మస్తాన్‌గూడకు చెందిన బెడద శ్రీనివాస్ (47) వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ గోపతి సురేష్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కడెం స్వస్థలమైన శ్రీనివాస్ 20 ఏళ్ల క్రితం లక్షెట్టిపేటకు వచ్చి పౌల్ట్రీ ఫామ్ నిర్వహించడంతో పాటు ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. పౌల్ట్రీ వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. సోమవారం గోదావరి సమీపంలో పురుగుల మందు తాగి కుమార్తెకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఆమె బంధువులకు చెప్పగా బంధువులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కవ్వాల్ అభయారణ్యంలోని ఎకో సెన్సిటివ్ జోన్ ను వెంటనే ఎత్తివేయాలి



తాళ్లపెల్లి రాజేశ్వర్ డిమాండ్

జన్నారం,నవంబర్ 10 (వుదయం విలేఖరి)

కవ్వాల్ అభయారణ్యంలోని ఎకో సెన్సిటివ్ జోన్ ను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తాళ్లపెల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన సుమారు 250 నుండి 300 వరకు ఇందిరమ్మ ఇళ్లు ఇసుక కొరతతో నిర్మాణ దశలోనే ఆగిపోయాయని అన్నారు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టలేక తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు.ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో అటవీశాఖ అధికారులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులు జరగడం లేదని అన్నారు. మండల ప్రజలు తమ అవసరాల కొరకు అడవిలోకి వెళ్లే అటవీశాఖ అధికారులు అడ్డుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని, దీంతో ప్రజలు తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు.ఇది మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని, అడవి పై ఆధారపడి జీవిస్తున్న కులాల వారిని వారు జీవించే స్వేచ్చను, హక్కులను కాలరాస్తున్నారన్నారు. అటవీశాఖ అధికారులు మండలంలోని రెవెన్యూ పరిధిలో ఉన్న సుమారు 60 శాతం ప్రభుత్వ భూమిని అటవీ భూమిలో కలుపుకున్నారని, రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేసి రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని అన్నారు. వెంటనే ఎకో సెన్సిటివ్ జోన్ ను ఎత్తివేసి అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు.అధికారులు స్పందించకుంటే త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోదూరు చంద్రయ్య, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు కాసెటి లక్ష్మణ్, సీనియర్ నాయకులు కే ఏ నర్సింలు, గౌడ సంఘం అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్, మైనార్టీ నాయకులు ఎండి యూసుఫ్, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మండల ఇన్చార్జి కొండూరి ప్రభుదాస్, మాల సంఘం నాయకులు అక్కవత్తుల దేవయ్య, నేతకాని సంఘం అధ్యక్షులు రత్నం లక్ష్మణ్, మోతె పురుషోత్తం,బొట్ల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో నాలుగు చోట్ల పోలీసుల దాడులు

22 మంది పేకాటరాళ్ల అరెస్ట్..
రూ.37,282 నగదు, 12 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నాగిరెడ్డిపేట,వుదయం

నాగిరెడ్డిపేట మండలంలో చట్టవిరుద్ధంగా డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న వారిపై నాగిరెడ్డిపేట పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎస్ఐ అగస్త్య భార్గవ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, గత మూడు రోజుల వ్యవధిలో నాలుగు చోట్ల వరుసగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 22 మంది పేకాటరాళ్లను పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.37,282 నగదు, 12 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భార్గవ్ గౌడ్ తెలిపారు.గోపాల్‌పేట గ్రామంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకొని రూ.1,572 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తాండూర్ గ్రామంలో అంజయ్య ఇంట్లో పేకాట ఆడుతున్న మరో నలుగురిని పట్టుకొని రూ.8,520 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.అదేవిధంగా జలాల్‌పూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని రూ.15,050 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

టేకుల చెరువు తండా శివారులో నిర్వహించిన నాలుగో దాడిలో ఎనిమిది మందిని పట్టుకొని రూ.12,140 నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని ఎస్ఐ భార్గవ్ గౌడ్ హెచ్చరించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ లో సత్తా చాటిన రాఘవేంద్ర కళాశాల విద్యార్థి

జన్నారం, నవంబర్ 10 (వుదయం విలేఖరి)



జన్నారం పట్టణంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థి కొట్టే అభిషేక్ ఢిల్లీలో జరిగిన 70వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2026-2027 – వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఏడో స్థానంలో నిలిచాడు.డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ & స్పోర్ట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఎన్సీటీ ఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో అభిషేక్ బరిలోకి దిగి అద్భుతమైన లిఫ్ట్ చేసి తన సత్తా చాటాడు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అభిషేక్ ను అభినందించి, మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అలాగే కళాశాల అధ్యాపక బృందం కూడా హర్షం వ్యక్తం చేసి అభిషేక్ ను అభినందించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ కె .హరిత


ఆసిఫాబాద్, (ఉదయం ప్రతినిధి):



గ్రామపంచాయతీల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రెబ్బెన మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు పట్టిక ఇతర రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. రికార్డులు, క్యాష్‌బుక్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తండ్రిని ఇంట్లోంచి గెంటేసిన కొడుకు

జగిత్యాల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం శాలపల్లి గ్రామానికి లైశెట్టి రాజయ్య (91) అనే వృద్ధ తండ్రిని తన కొడుకు రాజమొగిలి పోషణ వైద్య ఖర్చులు పెట్టక కొట్టి ఇంట్లోంచి గెంటి వేసిందని జగిత్యాల జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించాడు కాగా మంగళవారం సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులతో వెళ్లి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా వయోవృద్ధుల సంరక్షణ పోషణ చట్టం కింద కేసు నమోదు చేశారు అనంతరం ఆ వృద్ధ తండ్రి సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో తన గోడు విలేకరులకు వినిపించారు తన ఎకయిక కొడుకు రాజమొగిలి నా బాగోగులు చూసుకుంటానని నమ్మించి తన పట్టా భూమి 1 ఎకరం 20 గుంటలు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని నేను కాయ కష్టంతో జీవితావరాల కోసం దాచుకున్న 8 లక్షల 70 వేలు సైతం తీసుకొని నాకు తిండి పెట్టక అనారోగ్యంతో ఉన్నా కనికరం చూపక కొట్టి బలవంతంగా నేను కట్టిన నా ఇంట్లోంచి బలవంతంగా వెళ్ళగొట్టాడని నా కొడుకు నా ఇంటిలో నన్ను ఉంచుకొని నన్ను పోషిస్తూ ప్రతి నెలా 10 వేల రూపాయలు పోషణ వైద్య ఖర్చులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, నా కొడుకు కు నేను చేసిన 1ఎకరం 20 గుంటల భూమి గిఫ్ట్ డీడ్ ను రద్దు చేసి నా పేరిట మార్పించాలని నేను ఇచ్చిన 8 లక్షల 70 వేలు నాకు ఇప్పించాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించి ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా తన కొడుకు పై కేసు నమోదు చేశారని ఎస్పీ కి సైతం ఫిర్యాదు చేస్తానని ఆ వృద్ధ తండ్రి విలేకరుల ముందు ఏడుస్తు గోడు వెళ్ళబుసుకున్నాడు ఆ వృద్ధ తండ్రి వెంట సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ చట్టం కాన్సిలియేషన్ అధికారులు పిసి హన్మంత్ రెడ్డి వెల్మల ప్రకాష్ రావు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగులో నీటి యాజమాన్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి


కామారెడ్డి, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):-



మద్నూర్ మండలం చిన్న ఎక్లారా గ్రామంలో ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు పద్ధతులు, పంట యాజమాన్య మెళుకువలు, ప్రభుత్వ రాయితీలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక రైతు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం,వర్షపాతం తగ్గడం,నీటి లభ్యతలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తోటల్లో నీటి యాజమాన్యానికి ప్రాధాన్యత నిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల్లో బిందు సేద్యం ద్వారా అవసరమైన మేరకు నీటిని అందించాలని, మొక్కల చుట్టూ తేమ నిల్వ ఉండేందుకు మల్చింగ్ చేపట్టాలని, కలుపు మొక్కలను నియంత్రించాలని సూచించారు. ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించడంతో పాటు, సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వినియోగించాలని, మొక్కల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని వివరించారు. మొక్కల పెరుగుదల, పూత, కాయల అభివృద్ధి, గెలల దిగుబడి పెంపునకు అనుసరించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు మొక్కల సరఫరా, బిందు సేద్యం పరికరాలపై రాయితీలు, పంట నిర్వహణకు ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తోటల నిర్వహణకు ఒక ఎకరానికి సంవత్సరానికి రూ.4,200 చొప్పున నిర్వహణ రాయితీ అందిస్తున్నట్లు వివరించారు. రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ జగదీష్ చంద్రబాబు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని, ఉద్యాన శాఖ, కంపెనీ అధికారులు అందించే సాంకేతిక సూచనలను అనుసరించాలని తెలిపారు. నాణ్యమైన దిగుబడి సాధించాలంటే సరైన సమయంలో తోటల నిర్వహణ చేపట్టడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉద్యాన శాఖ అధికారులు, మద్నూర్ మండల వ్యవసాయ అధికారి, హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సిబ్బంది, ఉద్యాన శాఖ సిబ్బంది, సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన అమీనాబాద్ మజీద్ కమిటి నూతన కార్యవర్గ సభ్యులు

జగిత్యాల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల పట్టణంలోని అమీనాబాద్ మజీద్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మజీద్ సదర్ ఎండీ అబ్దుల్లా ఉపాధ్యక్షులు షేక్ ఇర్ఫాన్ నాయకులు ముజ్జు రెహమాన్ మసూద్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ షెడ్ ఇంకుడు గుంత నిర్మాణ పనులకు ముగ్గు పోసిన ఎంపీడీవో రామకృష్ణ

కోరుట్ల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



కోరుట్ల మండలం మోహన్ రావుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్డు ఇంకుడు గుంత నిర్మాణ పనులకు ఎంపీడీవో రామకృష్ణ ముగ్గు పోసి పనులను ప్రారంభించారు అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులతో పాటు కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని పర్యవేక్షించారు ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ సరికెళ్ళ లతిక నరేష్ వార్డు సభ్యురాలు అక్కెవ్వ గ్రామ కార్యదర్శి నర్సారెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి కరోబార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు

ప్రజావాణి దరఖాస్తులపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం!

సమస్యలు పరిష్కరించకుంటే ప్రజావాణి ఎందుకు?.. ఓడేడు సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి ఆవేదన


ముత్తారం నవంబర్ 10(వుదయం ప్రతినిది):



ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని ఓడేడు గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో ప్రభుత్వభూముల ఆక్రమణలు, రహదారులు,స్మశానవాటికకు సంబంధించిన సమస్యలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.కాల్వపల్లికి వెళ్లే రహదారి కబ్జాకు గురవుతోందని,దానికి సరిహద్దులు ఏర్పాటు చేసి రహదారిని కాపాడాలని కోరారు.గ్రామ స్మశానవాటిక భూమిని ఆక్రమించుకుంటున్నారని,దాని చుట్టూ హద్దులు ఏర్పాటు చేసి భూమిని పరిరక్షించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.గ్రామ శివారులోని సర్వే నంబర్ 402లో 61 ఎకరాల సీలింగ్ భూమి ఉందని సర్పంచ్ తెలిపారు.ఈ భూమిని నిషేధిత జాబితాలో ఉంచినప్పటికీ, గతంలో కలెక్టర్ 30 ఎకరాలను ఆ జాబితా నుంచి తొలగించి పట్టా చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారని పేర్కొన్నారు. సీలింగ్ భూమిని నిషేధిత జాబితా నుంచి ఎలా తొలగించారని ప్రశ్నించారు.మొత్తం 61 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో ఉంచి,సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఈ భూమిలో గ్రామానికి అవసరమైన వీవో భవనం,అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు స్థలం కేటాయించాలని కోరారు.ఈ సమస్యలపై సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి,ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ పలుమార్లు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని తెలిపారు.సర్పంచ్, ఉప సర్పంచ్ ప్రజావాణిలో దరఖాస్తులు ఇచ్చినా పట్టించుకోని అధికారులు..సామాన్య ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ఆమె ప్రశ్నించారు.ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామ సమస్యలను పరిష్కరించాలని,ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను ఇంటి పనులకు వాడుకుంటున్న ఎమ్మెల్యే

- నెలకు లక్ష రూపాయల జీతం తీసుకుంటున్న ఎమ్మెల్యే పనివాళ్లను పెట్టుకునే స్తోమత లేదా?
- ఎమ్మెల్యే సంజయ్ పై నిప్పులు జరిగిన జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది కల్వకుంట్ల కుటుంబం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు మెట్పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు ప్రజల పారిశుద్ధ్య పనుల కోసం కేటాయించిన మున్సిపల్ కార్మికులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తమ సొంత ఇంటి పనులకు వాడుకుంటున్నారని ఆరోపించారు నెలకు లక్షల రూపాయల జీతం తీసుకుంటున్న ఎమ్మెల్యేకి పని వాళ్లను పెట్టుకునే స్తోమత లేదా అని ప్రశ్నించారు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కల్వకుంట్ల కుటుంబం తీరుపై మెట్పల్లి కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు నిప్పులు చెరిగారు మెట్‌పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు కల్వకుంట్ల కుటుంబానికి లేదన్నారు గతంలో మాజీ ఎమ్మెల్యే 6 మంది మున్సిపల్ సిబ్బందిని తమ స్వంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడంతో అధికారులు వారిని తొలగించారని గుర్తు చేశారు ఇప్పటికీ ఆ ఇంటి పన్ను చెల్లించారా అని నిలదీశారు ఎమ్మెల్యేగా నెలకు 2 లక్షల 50 వేల రూపాయల జీతం తీసుకుంటూ కూడా మళ్లీ ఇప్పుడు ఇద్దరు మున్సిపల్ కార్మికులను సొంత పనులకు ఎలా ఉపయోగించుకుంటారని ప్రశ్నించారు పట్టణంలో పారిశుద్ధ్య పనులకు ఉపయోగించాల్సిన మున్సిపల్ సిబ్బందిని సొంత పనులకు ఎలా వాడుకుంటారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు 100 ఎకరాల భూములు ఉన్న కోరుట్ల నియోజకవర్గ కల్వకుంట్ల కుటుంబానికి పని వాళ్లకు నెలకు 30 వేల రూపాయల జీతం ఇచ్చేంత స్తోమత లేదా అని ఎద్దేవా చేశారు సొంత పనులకు వాడుకుంటున్న మున్సిపల్ సిబ్బందిని తక్షణమే మున్సిపాలిటీకి అప్పగించాలని ఇన్ని రోజులు ఆ కార్మికులతో చేయించుకున్న పనిదినాల జీతం డబ్బులను తిరిగి మున్సిపాలిటీ ఖాతాలో చెల్లించాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా మున్సిపల్ సిబ్బందిని దుర్వినియోగం చేసినందుకుగాను మెట్పల్లి ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని జువ్వాడి కృష్ణారావు స్పష్టం చేశారు ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ మెట్పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ రైసొద్దీన్ పలువురు కౌన్సిలర్లు కోఆప్షన్స్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నంబాల గ్రామంలోని సోలార్ ప్లాంట్ మంగళవారం జిల్లా కలెక్టర్, డి ఆర్ డి ఓ దత్తారం, ఎస్ ఇ ఉత్తం జడే సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ పనితీరును సమీక్షించారు. రోజుకు 10 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, యూనిట్‌కు రూ.3.13 ఆదాయం వస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడి శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, APM దుర్గయ్య, ఏఈలు, సీసీలు, వివోఏ లుపాల్గొన్నారు.



గాంధీనగర్ వద్ద వంతెన పనులను పరిశీలన

ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

జగిత్యాల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల – నిజామాబాద్ జాతీయ రహదారిపై జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ వద్ద చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించిన జగిత్యాల నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాయికల్ మండలానికి వెళ్తున్న సందర్భంగా గాంధీనగర్ వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ అధికారులను ఆదేశించారు అదేవిధంగా జగిత్యాల పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్న పైప్‌లైన్ దెబ్బతిన్న నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీఅధ్యక్షులు గాజంగి నందయ్య సీనియర్ కాంగ్రెస్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్ స్థానిక కౌన్సిలర్ స్వప్న గిరిధర్ సేవాదళ్ సెక్రటరీ ముకేష్ ఖన్నా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టపాసుల పేలుడు.. బాలుడికి గాయాలు!

ముత్తారం నవంబర్ 10(వుదయం ప్రతినిధి):

దీపావళి వేళ బాణసంచా పేలడంతో బాలుడి ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ముత్తారం మండలం రామకృష్ణాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన ఇరుగుల రవీందర్ కుమారుడు ఇంటి వద్ద టపాసులు కాలుస్తుండగా ఒక్కసారిగా పేలడంతో గాయపడ్డాడు.కుటుంబ సభ్యులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పండుగ వేళ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

గోదావరి నది హారతితో వైభవంగా కార్తీకమాసోత్సవాలు ప్రారంభం



ధర్మపురి నవంబర్10(ప్రతి నిధి):

కార్తీకమాసం సందర్భంగా శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి ఆలయం ఆధ్వర్యంలో గోదావరి నది హార తి కార్యక్రమం ఘనంగా ప్రారం భమైంది.మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా స్థానిక శారదా మహిళా మండలి సభ్యులు,వా సవి మహిళా మండలి సభ్యు లు,తిరుమల సేవా గ్రూప్ సభ్యు లు,శ్రీ వల్లి సేవా గ్రూప్ సభ్యులు, దేవస్థానం అర్చకులు,సిబ్బంది మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారంతా శ్రీలక్ష్మి నరసింహస్వా మి వారి ఆలయం నుండి మేళ తాళాలు,హరినామ సంకీర్తనల తో గోదావరి నది వరకు ఊరేగింపుగా చేరుకున్నారు.అక్కడ గో దావరి నదికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం నదిలో దీపాలు సమర్పించారు.

ఈకార్య క్రమంలో దేవస్థానం కార్యనిర్వ హణాధికారి సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వేముల.నాగ లక్ష్మి రాజేష్, సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్,వేదపండితు లు బొజ్జ రమేష్ శర్మ,పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ,ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచా ర్యులు,సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి,ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచా ర్యులు,అర్చకులు చిలకముక్కు అశ్విన్ కుమార్,అభిషేకం పురో హితులు బొజ్జ సంతోష్ కుమా ర్,రాజగోపాల్,అర్చకులు, సి బ్బంది, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

- ధర్మపురి కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు
- నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన అధికారులు

ధర్మపురి,నవంబర్ 10(వు దయం ప్రతినిధి):



మండల కేంద్రంలోని చైతన్య డి గ్రీ కళాశాల,శ్రీ లక్ష్మీనరసింహ సం స్కృతాంధ్ర కళాశాల పరీక్షా కేం ద్రాల్లో శాతవాహన విశ్వ విద్యా లయం డిగ్రీ సెమిస్టర్ పరీ క్షలు ప్రశాంత వాతావరణంలో కొన సాగుతున్నాయి.విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తున్నారు.విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ యా కేంద్రాల చీఫ్ సూపరిం టెం డెంట్లు లింగమూర్తి,డాక్టర్ జి.ప్ర భాకర్ వెల్లడించారు.పరీక్షల ని ర్వహణను పర్యవేక్షించేందుకు విశ్వవిద్యాలయానికి చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స భ్యులు ప్రొఫెసర్ డాక్టర్ పి.రా జు,కె.కృష్ణ ఆయా పరీక్షా కేంద్రా లను ఆకస్మికంగా తనిఖీ చేశా రు.గదుల్లోని పరిస్థి తులను, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.పరీక్షలు అత్యం త పారదర్శకంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చో టుచేసుకో కుండా ప్రశాంతంగా నిర్వహిస్తున్న తీరును వారు పరిశీలించారు.ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్లను,సి బ్బందిని ప్రత్యేకంగా అభినం దించారు.పరీక్షల నిర్వహణ పట్ల తాము పూర్తి సంతృప్తితో ఉన్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు విజిటర్స్ రిజిస్టర్‌లో తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా నమోదు చేసినట్లు చీఫ్ సూపరింటెం డెంట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో రాజన్న ఆలయ అధికారుల ఉన్నతస్థాయి భేటీ

- 2027 పండుగల తేదీల ఖరారుపై ప్రజాభవన్‌లో అర్చకులతో సమావేశం
- వీటీడీఏ అధికారులతో ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

వేములవాడ, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి) :



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన కీలక సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, రానున్న 2027 సంవత్సర పండుగల నిర్వహణకు సంబంధించి అధికారులు పలు అంశాలపై చర్చించారు.హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల స్థానాచార్యులు, ముఖ్య అర్చకులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2027 సంవత్సరంలో నిర్వహించనున్న వివిధ పండుగలు, ఉత్సవాల తేదీల ఖరారుపై చర్చించారు.ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్య (ఐఏఎస్), దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు (ఐఏఎస్), దేవాదాయ ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులను వేములవాడ ఆలయ అర్చకులు, వేద పండితులు మర్యాదపూర్వకంగా కలిసి రాజరాజేశ్వర స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదం, 2027 నూతన క్యాలెండర్‌ను అందజేశారు.అనంతరం వేములవాడ ఆలయ కార్య నిర్వహణాధికారి ఎల్. రమాదేవి, వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి, వాటి అమలు తీరు, తదుపరి చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు.ఈ సమావేశాల్లో ఆలయ ముఖ్య అర్చకులు, స్థానాచార్యులు, వేద పండితులు, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

వెనుక నుంచి ఢీ.. ఆపై పరారీ!

- రహదారిపై వాటర్ ట్యాంకర్ బీభత్సం..
- హరిపురం కూలీకి తీవ్ర గాయాలు

ముత్తారం నవంబర్ 10(వుదయం ప్రతినిధి):



ముత్తారం –గోదావరిఖని ప్రధాన రహదారిపై వాటర్ ట్యాంకర్ లారీ బీభత్సం సృష్టించింది. వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి.. ఆపై ఆగకుండా పరారయ్యేందుకు ప్రయత్నించింది.ఈ ఘటనలో హరిపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రామంచ ఓదెలు తీవ్రంగా గాయపడ్డాడు.మంగళవారం ఎరువుల కొనుగోలుకు బైక్‌పై వెళ్తున్న ఓదెలును జాతీయ రహదారి పనుల్లో ఉన్న వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది.ప్రమాదం అనంతరం డ్రైవర్ పరారవుతుండగా స్థానికులు వెంబడించి మచ్చుపేట ప్రధాన చౌరస్తా వద్ద అడ్డుకున్నారు.గాయపడిన బాధితుడిని ప్రైవేట్ వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.ముత్తారం ఎస్సై ఎన్.రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.బాధితుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మంజూరైన వసతి గృహాలు, కేజీబీవీ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష



మహబూబ్‌నగర్.

సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల అభివృద్ధి పనులు వేగం అందుకోనున్నాయి. మంజూరైన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఛాంబర్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, వార్డెన్లు సమన్వయంతో పనిచేయాలి. ఈఈ, డీఈఈ, ఏఈఈలు కూడా అమలును వేగవంతం చేయాలి. పనుల పురోగతిని తరచుగా సమీక్షించి, క్షేత్రస్థాయిలో నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని స్పష్టం చేశారు. పెండింగ్ పనులపై శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి. విద్యార్థుల సౌకర్యార్థం క్లాత్స్ క్లిప్స్‌ను పంపిణీ చేశారు.

ఎం. చత్రు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు

పారదర్శకతతో విధులు నిర్వహిస్తానన్న ఎం. చత్రు



మహబూబ్‌నగర్.

మహబూబ్‌నగర్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా ఎం. చత్రు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా ఉన్న ఎం. చత్రుకు అదనపు బాధ్యతలు దక్కాయి. మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించారని ఎం. చత్రు తెలిపారు. మైనార్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు చేరేలా కృషి చేస్తానన్నారు. శాఖ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తానని స్పష్టం చేశారు. ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహిస్తానని ఎం. చత్రు పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించడం ఇదే తొలిసారి. కొత్త బాధ్యతలను అవకాశంగా భావించి నిబద్ధతతో పనిచేస్తానని ఆయన చెప్పారు. కలెక్టర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎం. చత్రు తెలిపారు.

వరంగల్‌లో మహిళలకు కుట్టు మిషన్లు, చీరల పంపిణీ

పాతవీధి బజార్ జిల్లా కార్యాలయం ఎదుట



వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 10.

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. వరంగల్లోని పాతవీధి బజార్ జిల్లా కార్యాలయం ఎదుట మహిళలకు కుట్టు మిషన్లు, చీరలు పంపిణీ చేశారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. ఆర్యవైశ్యుల ఐక్యత, అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్మీనారాయణ లక్ష్యమని దుబ్బ శ్రీనివాస్ గుప్తా కొనియాడారు. లక్ష్మీనారాయణ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని శ్రీనివాస్ గుప్తా ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతి, ఆస్తుల అభివృద్ధి, పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి మరిన్ని పథకాలు అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా, రాష్ట్ర, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి – రామ రాజేష్ ఖన్నా



వరంగల్ సిటీ, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి) :

వరంగల్ నగరంలోని పోచం మైదాన్ సర్కిల్‌లో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మంగళవారం నాటికి సమ్మె 29వ రోజుకు చేరుకుంది. జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఉద్యోగుల డిమాండ్లను వివరించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ తక్షణమే రెగ్యులరైజేషన్ చేయాలని ఆయన కోరారు. రెగ్యులరైజేషన్ పూర్తయ్యే వరకు ఉద్యోగులకు 100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హెల్త్ కార్డుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రామ రాజేష్ ఖన్నా సూచించారు. ఈ డిమాండ్లపై పోచం మైదాన్ సర్కిల్‌లో జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె సాగుతోంది. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా. టీ భరత్ కుమార్, డాక్టర్ గుండా రవీందర్ పాల్గొన్నారు. వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఫార్మసీ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర ఉద్యోగులు హాజరయ్యారు.

సర్పంచ్ స్వప్న సంతోష్ అంగన్వాడీలో పౌష్టికాహారం తనిఖీ చేశారు

నవంబర్ 10న గుంటూరు పల్లెలో




రాయపర్తి, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)

నవంబర్ 10న గుంటూరు పల్లె అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ స్వప్న సంతోష్ కందికట్ల పరిశీలించారు. కొత్తూరు గ్రామ పరిధిలోని కేంద్రంలో చిన్నారుల హాజరు, నిర్వహణ, పౌష్టికాహార పంపిణీని ఆమె తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని సిబ్బందికి సూచించారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు ప్రభుత్వ పౌష్టికాహారం ఎలాంటి ఆటంకాలు లేకుండా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. పౌష్టికాహారం నాణ్యతలో రాజీ వద్దని సర్పంచ్ స్వప్న సంతోష్ పేర్కొన్నారు. ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తుకు పునాదులని ఆమె అన్నారు. పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ పెట్టి, గర్భిణులు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. పెరికిడు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, గ్రామ కార్యదర్శి ఎండీ అస్మా కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యాశాఖ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఖానాపురం, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినటువంటి నేటి వరకు 71 వేల 71 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్ద ఉన్న విద్యాశాఖకు నిధులు కేటాయించారు. కానీ ఆ నిధులతో జరిగిన అభివృద్ధిపై శ్వేత పత్రంను అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసే దమ్ము ధైర్యం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి ఉందా అని బీసీ రాష్ట్ర నాయకుడు బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యదర్శి బత్తిని శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖను అవినీతిమయం చేయడానికి విద్యా శాఖను తన వద్ద పెట్టుకున్నాడని తెలుపుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జిల్లా విద్యాశాఖ అధికారిని రెగ్యులర్గా నియమించార, అలాగే మండల విద్యాశాఖ అధికారిని రెగ్యులర్గా నియమించారా ఇన్చార్జిలతోనే కాలం వెలదీసుకుంటూ వస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, రెగ్యులర్ డీఈవో, ఎంఈఓ ఉంటే విద్యాశాఖలో అవినీతికి తావు ఉండదని విద్యా శాఖలో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయకుండా విద్యాశాఖను తన వద్ద ఉంచుకోవడం ఎంతవరకు సమంజసం అని ముఖ్యమంత్రిని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా తక్షణమే ముఖ్యమంత్రి మేలుకొని ప్రతి జిల్లాకు రెగ్యులర్ డిఈఓను మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఇప్పటివరకు విద్యాశాఖకు కేటాయించిన నిధులపై తక్షణమే శ్వేత పత్రం విడుదల విడుదల చేయాలని శిధిలావస్థలో ఉన్న స్కూళ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రహరీ గోడ లేని ప్రభుత్వ పాఠశాలకు వెంటనే ప్రహరీ గోడ నిర్మాణంను చేయించాలని ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రిని బత్తిని డిమాండ్ చేశారు.



మాజీ వార్డు సభ్యుడు బోర్ర రాజు తల్లి మృతి

బుధారావుపేటలో నవంబర్ 10న మృతి

ఖానాపురం, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

ఖానాపురం మండలంలోని బుధారావుపేటలో బోర్ర సులోచన మృతి చెందారు. మాజీ వార్డు సభ్యుడు బోర్ర రాజు తల్లి సులోచన వయసు 65 సంవత్సరాలు. అనారోగ్యంతో సులోచన నవంబర్ 10న కన్నుమూశారు. సులోచన మృతదేహాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు సందర్శించారు. నాయకులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎస్ కే మౌలానా, కాస ప్రవీణ్ పాల్గొన్నారు. నేలమరి నాగరాజు, చెడిపాక శ్రీను కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. సోమరపు రవి, బత్తిని శాంతికుమార్, చెడిపాక యాకయ్య పాల్గొన్నారు. బత్తిని నర్సయ్య, బొల్లం వీరస్వామి, చెడిపాక అశోక్, వెంకన్న కూడా ఉన్నారు.



నర్సంపేట నూతన మున్సిపల్ కమిషనర్‌కు బి ఆర్ టి యు నాయకుల శుభాకాంక్షలు

నవంబర్ 10న నర్సంపేటలో మర్యాదపూర్వక భేటీ

నర్సంపేట వుదయం ప్రతినిధి నవంబర్ 10.

నర్సంపేట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నరేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నవంబర్ 10న బి ఆర్ టి యు కార్మిక సంఘం నాయకులు కమిషనర్‌ను కలిశారు. బి ఆర్ టి యు నాయకులు నరేష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. నర్సంపేటలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి పాల్గొన్నారు. బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కూడా హాజరయ్యారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్ పాల్గొన్నారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం సమ్మయ్యతో పాటు పలువురు హాజరయ్యారు.



కాంగ్రెస్ మాజీ వార్డు సభ్యుడి తల్లి మృతి

బుధరావుపేటలో నవంబర్ 10న కన్నుమూత

ఖానాపురం, నవంబర్ 10 (వుదయం ప్రతినిధి):

ఖానాపురం మండలం బుధరావుపేటలో బోర్ర సులోచన మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు సభ్యుడు బోర్ర రాజు తల్లి సులోచన వయసు 65 సంవత్సరాలు. అనారోగ్యంతో నవంబర్ 10న ఆమె కన్నుమూశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు, సొసైటీ పర్సన్ లింగడి వెంకటేశ్వర్లు సులోచన మృతదేహాన్ని సందర్శించారు. మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు చెడుపాక ఉపేందర్ కూడా మృతదేహాన్ని సందర్శించారు. లింగడి వెంకటేశ్వర్లు, చెడుపాక ఉపేందర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సులోచన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు చెడిపాక యాకయ్య పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి నారగని సమ్మయ్య, బ్లాక్ నాయకుడు గిరగని నర్సయ్య హాజరయ్యారు.



రైతులు రహదారులను విడిచి సురక్షిత ప్రదేశాల్లో ధాన్యం ఆరబెట్టాలి

గ్రామ పంచాయతీ ప్రాంగణాలు వినియోగించాలి

మెదక్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం ప్రమాదకరమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు హెచ్చరించారు. నవంబర్ 11న మెదక్‌లో ఎస్పీ ఈ సూచనలు చేశారు. రహదారులపై ధాన్యం ఉంచితే వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. రైతులు గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఇతర సురక్షిత ప్రదేశాల్లోనూ ధాన్యాన్ని ఆరబెట్టుకోవచ్చని చెప్పారు. రహదారులపై ధాన్యం ఉండటం వాహనదారులకు ప్రమాదాలు తెచ్చే అవకాశముందని వివరించారు. ధాన్యం చుట్టూ ఉంచిన రాళ్లు రాత్రివేళల్లో కనిపించవని ఎస్పీ పేర్కొన్నారు. నల్లటి పాలిథిన్ కవర్లతో కప్పిన ధాన్యమూ వాహనదారులకు గుర్తుపడదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు.

నందిపేట గ్రామంలో మండల ప్రత్యేక అధికారి గంప శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు

గ్రామంలో 1,850 జనాభా ఉంది



మహబూబ్‌నగర్.

మహబూబ్‌నగర్. మూసాపేట మండల ప్రత్యేక అధికారి గంప శ్రీనివాస్ నందిపేటలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు.

పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు.

గ్రామంలో 1,850 జనాభా, 1,180 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు. పల్లె దవాఖాన, అదనపు నీటి సరఫరా, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ కోసం గ్రామస్తులు కోరారు.

పాఠశాలలో వారానికి మూడు రోజులు గుడ్లు ఇవ్వాలని భోజన ఇన్‌చార్జిని ఆదేశించారు. గంప శ్రీనివాస్ పంచాయతీ రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు.

అమీన్‌పూర్‌లో దున్నపోతుల విన్యాసాలతో వైభవంగా సాగిన 'సదర్' సంబరాలు

నవంబర్ 10న అమీన్‌పూర్‌లో



అమీన్‌పూర్, నవంబర్ 10 వుదయం,

